# శివరంజని



వేదుల మీనాక్షీదేవి

'టింగ్' మన్న ధ్వని విని కళ్లు తెరిచారు శంకరం మేష్టారు. ఎదట చాపమీద ఒడ్డిగిలబెట్టి ఉంది ఫిడేలు. ఫిడేలు చుట్టూ పువ్వులున్నాయి. దగ్గరలోనే కర్పూరహారతి వెలుగుతూంది. ఆ వేడికి నాలుగు తీగెలూ ఒక్కమారే తెగిపోయాయి.

రమకు తొమ్మిదవ ఏడు. బాసినపట్టు వేసుకుని దణ్ణం పెడుతున్నదల్లా తీగలు తెగిన చప్పుడు విని గడగడలాడింది.

అక్కడున్నవారి గుండెలు జారిపోయాయి.

సంగీతం పాఠం ప్రారంభం ఆనాడే. ఇదేం అపశకునం అనుకుంటున్నారు ఇంట్లోవాళ్లు.

శంకరం మేష్టారు రమ చేత విఘ్నేశ్వరపూజ చేయించారు. తరువాత ఫిడేలు మీద పువ్వులు వేయించారు. కొబ్బరికాయ కొట్టించి నివేదన చేయించారు. హారతి వెలిగించారు.

విఘ్నేశ్వరప్రార్థన, సరస్వతీప్రార్థన ప్రారంభించారు మేష్టారు. కళ్లు మూసుకుని మైమరచి పాడుతున్నారు. చెంపల మీదుగా బాష్పాలు జారసాగాయి.

శ్రుతి చేసిన తీగలు తెగినప్పుడు చేసిన సంగీతధ్వని విని కళ్లు తెరిచారు మేష్టారు.

తీగలు తెగిన ఫిడేలును, వెలుగుతున్న హారతిని, వణకుతున్న రమను చూశారు.

"జయం!" అన్నారు మేష్టారు. "లే, తల్లీ! అందరికీ దణ్ణం పెట్టు!" అన్నారు రమ వీపు ఆప్యాయంగా నిమురుతూ. ఆయన సజలనయనాలు ఆనందంతో మెరిశాయి.

"ఇదేమిటండీ జయం అంటారు? అడుగులోనే పిడుగు అన్నట్టు పాఠం ప్రారంభంలోనే తీగెలు తెగిపోవడమా! ఇది అపశకునం!" అంది రమ అమ్మమ్మ.

"ఎంత మాట అన్నారు! సరస్వతీ ప్రార్థనకు ఆ విధంగా ఎవ్వరికోగాని జరగదు. ఆ వాణి అమ్మాయికి ప్రసన్నురాలయింది. మన అమ్మాయి ఈ విద్యలో మంచి ప్రావీణ్యం సంపాదిస్తుంది!" అన్నారు మేష్టారు.

అంతా ఆశ్చర్యంగా విన్నారా విషయం.

రమచేత ముందుగా మేష్టారికి నమస్కారం చేయించింది తల్లి.

000

రమ నాలుగేళ్ల పిల్లప్పట్నించి సంగీతం అంటే మహా ఇష్టం. ఎక్కడ ఏ పాట విన్నా సరే, ఇట్టే పట్టుకుని ఇంటికివచ్చి పాడేస్తూండేది.

వాళ్లు కాపురం ఉండే పక్కవాటాలో మరొక కుటుంబం ఉండేది. వారికొక అమ్మాయి ఉంది. ఆ అమ్మాయికి సంగీతం చెప్పిస్తున్నారు. గాత్రం చెప్పుకుంటూంది. ఆ అమ్మాయిని 'అక్కా' అని పిలుస్తుంది రమ. సంగీతం మేష్టారు పాఠం చెప్పినంతసేపూ అక్క పక్కనే కూర్చుని వింటూండేది రమ.

నేల మీద మునివేళ్లతో కొడుతూ కళ్యాణి కృతి, దర్బారు వర్ణం పాడేది. "నేను మేష్టార్నట" అంటూ బొంగురు గొంతుకతో పాడేది. అక్కలాగ సన్న గొంతుకతో పాఠం చెప్పుకుంటున్నట్లు పాడేది.

ఆరేళ్లు వచ్చేసరికి రమకు సరళీస్వరాలు, జంటస్వరాలు, అలంకారాలు, పిళ్లారి గీతాలు, స్వరజతులు, నాలుగైదు వర్ణాలు వచ్చాయి. తానం రాకపోయినా కట్టుగా పాడేది.

రమ ఉండే ఇంటికి రెండు ఇళ్ల అవతల సరస్వతి అనే అమ్మాయి ఫిడేలు బాగా వాయిస్తుంది. ఇంకా ప్రైవేటు చెప్పించుకుంటూంది.

ఆ అమ్మాయి నేర్చుకుంటున్నా, సాధన చేసుకుంటున్నా రమ అక్కడ ఉందన్నమాటే.

"రమా!" అని తల్లి పిలుస్తుంది.

"అదిగో, వాళ్ల సరస్వతి ఫిడేలు వాయింపు వినబడ్డంలేదూ? ఇంకా రమను పిలుస్తావేమిటి?" అని ఇంట్లోవాళ్లు వేళాకోళం చేసేవారామెను.

"అక్క మేష్టారిచేత నీకూ సంగీతం చెప్పించనా?" అని అడిగారు రమను వాళ్ల నాన్నగారు.

"నాకు సరస్వతి మేష్టారే చెప్పాలి. అక్కలా ఉట్టినే చెప్పుకోను. నాకు ఫిడేలు కొను!" అంది.

"హాసి భడవా!" అని నవ్వుకున్నారంతా.

ఆ సాయంత్రం సరస్వతికి చెప్పే మేష్టారికి కబురంపారు. రమకు సంగీతం చెప్పమన్నారు రమ నాన్నగారు.

"మీరు అడగకుండానే చెబుదామనుకుంటున్నానండీ! అమ్మాయి ఆసక్తి చూస్తున్నాను. విద్యయందు ఆసక్తి ఉన్నవాళ్లకు చెప్పకపోతే మహాపాపం! ఆ విద్యాధిదేవతకే అపచారం చెయ్యడం అన్నమాట. నాకు సొమ్ముతో పనిలేదు. తీరుబడి లేకపోయినా ఎలాగో వీలు చూసుకుని వస్తాను!" అన్నారు శంకరం మేష్టారు.

000

కాలి తెగిన తీగెలు తీసేశారు. కొత్త తీగెలు కట్టారు శంకరం మేష్టారు.

కొత్త బైండు పుస్తకాన్ని తెరిచి మొదటి పేజీకి పసుపు వ్రాశారు కొద్దిగా.

> వేదుల మీనాక్షీదేవి గారు రచించిన ఈ కథ *ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక* 7 - ఫిబ్రవరి -1962 సంచికలో ప్రచురితమయింది.

"అవిఘ్నమస్తు!" అని వ్రాశారు.

మొదటి సరళీస్వరం చెప్పారు.

"రేపు అప్పచెప్పు!" అన్నారు.

"రేపెందుకండీ? ఇప్పుడే అప్పచెప్పేస్తా!" అంటూ తాళంతో అప్పగించేసింది.

"ఇలాగే నేను చెప్పే పాఠాలన్నీ అప్పగించాలి!" అంటూ చక్కా పోయారు మేష్టారు.

ఆరు నెలలకు స్వరజతులు, స్వరపల్లవులు. గీతాలు తాళంతో కూడా కట్టుగా వచ్చేశాయి.

త్యాగరాజస్వామి ఉత్సవాలలో అందరి శిష్యులతోపాటు రమ చేత కూడా పాడించారు మేష్టారు. ఆయన శిష్యులందరిలోనూ రమే చిన్నది.

ఒక గీతం, స్వరజతి వాయించింది. కళ్యాణివర్ణం గాత్రాన్ని పాడింది. తాళం మాత్రం రాదు. చిన్నప్పుడు విన్నది.

"ఇంత చిన్న అమ్మాయి ఇంత చక్కగా పాడిందంటే ఆశ్చర్యంగా ఉంది. ఇది చెప్పుకున్నది కాదు. కేవలం వినికిడి వల్ల నేర్చుకున్నదట. ఈ అమ్మాయి ముందుముందు గొప్ప పాటకురాలు కావాలని దీవిస్తున్నాను!" అన్నారు ప్రత్యేకాహ్వానంపై వచ్చిన ఒక పెద్దాయన. "మీ ఆశీర్వాదబలం ఉంటే తప్పకుండా అవుతుంది!" అన్నారు మేష్టారు.

"బాగా పాడిందండీ అమ్మాయి!" అన్నారు మేష్టారు రమ నాన్నగారితో.

"ఇలాంటి శిష్యులుంటేనే గురువుగారికి పేరు, ప్రతిష్ఠ!" అన్నారు మేష్టారు.

"ఏదో దాని ముఖం...!" అన్నారు రమ నాన్నగారు. పెద్దవాళ్లు చిన్నవాళ్లను పొగడకూడదని ఆయన అభిప్రాయం.

"మీరు ప్రారంభించిన వేళావిశేషం!" అంది రమ తల్లి.

ఆమె ఆ మాట అనగానే సరస్వతీప్రార్థన, వెలుగుతున్న హారతి, తీగెలు తెగిన ఫిడేలు కళ్లకు కట్టినట్లయింది అందరికీ.

మూడు త్యాగరాజ ఉత్సవాలయ్యాయి. అది నాలుగవ సంవత్సరం. రమకు పన్నెండేళ్లు. రాగాలాపన, స్వరకల్పన చేతనయింది.

ఆ సంవత్సరం రమకు, మరొక నలుగురైదుగురికి గంట ప్రోగ్రాం ఇచ్చారు. అంతా బాగానే వాయించారు.

ఆ సభకు పెద్దలెందరో సభ్యులుగా వచ్చారు. సభ పూర్తయింది.

ముగింపు వాక్యాలు చెబుతూ, "ఈనాడు జరిగిన పోటీలో రమాదేవికి మొదటి బహుమతి ఇస్తున్నాం!" అని కార్యదర్శి ప్రకటించారు.

రమ తెల్లబోయింది.

"పోటీ అని చెప్పారు కారేం?" అని నిగ్గదీసింది రమ మేష్టార్ని.

"పోటీ అంటే భయపడి వాయించలేవు సరిగ్గా. నిజం చెప్పు! ఇప్పుడు వాయించినంత స్వేచ్ఛగా వాయించగలవా?" అన్నారు మేష్టారు.

రమకు వెండి కప్పు బహుమతి వచ్చింది.

మేష్టారి ముఖంలో సంతృప్తి వెలిగింది.

000

రమ హైస్కూలు క్లాసుల్లోకి వచ్చింది.

మేష్టారు రమను సంగీతం పరీక్షకు కట్టించారు.

స్కూలు పాఠాలతోనూ, ఇంటికి ఇచ్చిన పనితోనూ సతమతమౌతూంది రమ. సంగీత సాధనానికి సావకాశం అవడం లేదు.

"శాస్త్రం అప్పచెప్పు"మనేవారు మేష్టారు.

"చదవడానికే తీరిక లే"దంటుంది రమ.

"తీరిక లేకపోవడమేమిటి! నీ స్నేహితురాళ్లతో మాట్లాడినంతసేపు పట్టదు!" అని వేళాకోళం చేసేవారు మేష్టారు. అన్నారే కానీ, ఆయనకే తెలుసు కష్టమని.

అందుచేత శాస్త్రంలోని అంశాలు విడమరిచి అర్థమయ్యేలాగా చెప్పేవారు. వెంటనే అప్పగించేసేది.

ఆ విధంగా శాస్త్రము, సంగీతము అతిశ్రద్ధగా, కుతూహలం కలిగేలాగా చెప్పేవారు రమకు.

పాటకచేరీలకు తీసుకువెళ్లి వినిపించేవారు. మెలకువలు, బాగోగులు చెప్పేవారు.

సంగీతం లోయరు పరీక్ష ప్రథమశ్రేణిలో పాసైంది రమ.

మేష్టారి ఆనందానికి అవధి లేదు!

హయ్యరు కోర్సు ప్రారంభించారు మేష్టారు.

రకరకాల రాగాలు, తానం, స్వరకల్పన, పల్లవులు చెప్పారు.

నెలసరి కచేరీలలో రమకు తరచు అవకాశం లభిస్తూండేది. క్రమంగా రమ సంగీతం శ్రోతల మన్ననలకు పాత్రమైంది.

"ఇక ఆరు మాసాలు నేర్చుకుంటే చాలు, ట్యూషనవసరం లేదు!" అన్నారు మేష్టారు.

000

రమ సంగీతానికి అంతరాయం కలిగే పరిస్థితులేర్పడ్డాయి ఇంట్లో.

రమకు ఇద్దరు అన్నలు, ఇద్దరు తమ్ముళ్లు ఉన్నారు. అన్నలిద్దర్నీ ఆ సంవత్సరంపై ఊరు పెద్ద చదువుకు పంపాలి. సొమ్ము ఎత్తి పంపడం కష్టం.

కాపురం మారిస్తే తీరిపోతుంది. పెద్ద పిల్లలకూ ఇబ్బంది ఉండదు భోజనానికి. రమకు, తమ్ముళ్లకు హైస్కూలు ఆ ఊళ్లోనూ ఉంది. ఆఖరి పిల్లవాడి చదువు అయ్యేదాకా అక్కడే ఉండిపోవచ్చు.

ఇలా ఆలోచించి కాపురం మార్చడానికే నిర్ణయించారు రమ నాన్నగారు.

రమకు చాలా నిరుత్సాహం కలిగింది.

ఈ సంగతి మేష్టారు విని నిర్ఘాంతపోయారు.

"నాకు పేరు తెచ్చే శిష్యురాలు దొరికిందని ఆనందించాను. ఇప్పుడు ఎక్కడపడితే అక్కడ కచేరీ చెయ్యగల సమర్థత వచ్చింది. ఇక కొంచెం మాత్రం చెప్పవలసి ఉంది!" అన్నారు మేష్టారు.

రమకు ఏమీ తోచడంలేదు.

ఈ విద్య అంతు తెలుసుకోవాలని ఆమె కోరిక.

వెళ్లే ఊళ్లో తగిన మేష్టార్లున్నారో, లేరో? ఒకవేళ ఉన్నా శంకరం మేష్టారులాగా చెప్పడం వారి తరం కాదు.

ఇంతవరకూ తాను నేర్చిన విద్య వృథాయేనా? కొన్నాళ్లయ్యేటప్పటికి తను సంగీతం క్రమంగా మరిచిపోవడానికి అవకాశం లేకపోలేదు.

ఇలా తలచుకుంటే ఎంతో బెంగగా ఉంది.

"అమ్మాయీ! అనగననగ రాగమతిశయిల్లుచునుండు - అన్నారు వేమన యోగి. సంగీతానికి సాధనే ముఖ్యం. ఎంత తీరుబడి లేకపోయినా రోజుకు రెండు గంటలు కచ్చితంగా సాధన చేసితీరాలని అనుకుంటే వాయించగలవు!" అంటూ ఏడుస్తున్న రమకు ధైర్యం చెప్పారు మేష్టారు రైలు కిటికీ దగ్గర.

"ఆ ఊళ్లోనే నేనెరుగున్న ఒక పాటకుడున్నారు. ఆయనకు ఉత్తరం రాస్తాను. అమ్మాయికి అక్కడ కూడా శ్రద్ధగా చెప్పించండి!" అని మరీమరీ రమ నాన్నగారితో చెప్పారు.

మేష్టారికి నమస్కారం చేసింది కదులుతున్న రైల్లోంచి రమ.

మేష్టారు కండువాతో కళ్లు అద్దుకున్నారు.

000

రమకు ఊరు కొత్త. ఇల్లు కొత్త. స్కూలు కొత్త.

మెల్లిగా అలవాటవుతున్నాయి.

అనుకున్న ప్రకారం రోజూ రెండుగంటలు కచ్చితంగా సాధన చేసేది రమ. కొన్నాళ్లయ్యేసరికి వాయించినదే వాయించడం, అవే రాగాలు, అవే వర్ణాలు వాయించి, వాయించి విసిగిపోయింది.

ఇంతకన్నా ప్రాప్తంలేదు కాబోలు అని నిరాశ చెందింది.

ఇక ఇది పని కాదనుకుంది.

కొత్తకొత్త రాగాలు తీసుకుని వాటి ఆరోహణ, అవరోహణ క్రమం, స్వరస్థానాలు తెలుసుకుని మెల్లిమెల్లిగా ఆలాపన చేసేది. ఆ రాగాలు రేడియోలో పాడుతూంటే కూడా వాయించేది.

అదే తన విద్యాభివృద్ధికి ఆధారం.

ఏకలవ్యుడిలాగా గురువుగారి మీద గురి ఉంది. విద్య సాధించాలి. తానీ విద్య మరిచిపోకూడదు అని పట్టుదల వహించింది.

ఇల్లు వెతుక్కుంటూ వచ్చారు కొత్త సంగీతం మేష్టారు. శంకరం మేష్టారు ఉత్తరం వ్రాశారట ఆయనకు.

రమ నాన్నగారు ఆయన్ను పాఠం చెప్పడానికి ఏర్పాటు చేశారు.

రమను వాయించమన్నారు. మేష్టారూ వాయించారు.

ఇద్దరూ ఒక కీర్తనే వాయించినా ఎక్కడా పోలిక లేదు.

కొత్త మేష్టారు ఆ రోజు పాఠం చెప్పి వెళ్లిపోయారు.

ఆ మధ్యాహ్నం రమ ఇంటికి వాళ్ల బంధువు ఒకాయన వచ్చాడు. ఏదో మాటవరసగా గొత్త మేష్టారి మాట వచ్చి "ఈయన కూడా చాలా సమర్థులు. అయితే చిన్నప్పట్నించి శంకరం మేష్టారి దగ్గరే నేర్చుకోవడం వల్ల మరొకరు ఎలా చెబుతారో తెలియదు. అమ్మాయికి ఈయన పద్ధతి కొత్తగా ఉంది" అంది రమ తల్లి.

"అన్నట్లు చెప్పడం మరిచిపోయాను, శంకరం మేష్టారు ఇంట్లో ఎవరికీ చెప్పకుండా ఎక్కడికో వెళ్లిపోయారట. వాళ్ల పిల్లలు చెప్పారు!" అన్నాడు వచ్చిన బంధువు.

"అయ్యో! అదేమిటి! ఎందుకు వెళ్లిపోయారో?" అంది ఆవిడ.

అక్కడే చాపమీద కూర్చుని రాసుకుంటూంది రమ. ఈ మాటలు విని వెక్కివెక్కి ఏడవడం ప్రారంభించింది.

"ఎప్పుడైనా ఆ ఊరు వెడితే మేష్టారి దగ్గర పాఠం చెప్పుకోవచ్చునని ఇంకా ఆశపడ్డాను!" అని వాపోయింది.

"మీరు వెళ్లేముందునాడూ జ్ఞాపకం ఉంచుకుని ఈ ఊళ్లో నాకు విద్యకేర్పాటు చేశారా! ఎందుకు నా మీద ఇంత వాత్సల్యం మేష్టారూ?" అని విలపించింది రమ.

రెండువ రోజు పాఠానికి వచ్చారు మేష్టారు.

పాఠం అంటే బెంగగా ఉంది రమకు.

అంతా అగమ్యగోచరంగా ఉంది.

"ఏయే రాగాలు చెప్పారమ్మా శంకరం మేష్టారు?" అన్నారు కొత్త మేష్టారు.

తన బైండు పుస్తకం ఇచ్చింది. మొదటి నుండి చివరిదాకా పేజీలు తిరగవేశారు. ఆఖరి పేజీలో రమ నేర్చుకున్న రాగాలన్నీ వరసలో ఉన్నాయి వ్రాసి.

ఆ వరసలోని ఆఖరి రాగం శివరంజని.


అదే తమ శంకరం మేష్టారి దగ్గర నేర్చుకున్న కడసారి రాగం.

"శివరంజని!" అని మెల్లిగా నోట్లో గొణుక్కుంది రమ.

రమ శూన్యంలోకి చూస్తూంది. ఏవో ఆలోచనలు ... గతంలోనికి ...

000

తెల్లవారితే ఆ ఊరి నుండి వెడతారనగా వీధి గదిలో ఒక్కర్తే కూర్చుని శివరంజని రాగం వాయిస్తూంది రమ. మేష్టారి దగ్గర వాయించేటప్పుడు తప్పు వస్తుందేమోనన్న భయంతోనూ, సిగ్గుతోనూ, స్వేచ్ఛగా వాయించలేదు. ఒక్కర్తే ఉన్నప్పుడు తన



ఇష్టం వచ్చినట్లు వాయించేస్తూంటుంది.

ఆ రోజున కూడా పాఠం చెబుదామని వచ్చారు శంకరం మేష్టారు. ఆ సంగతి రమకు తెలియదు.

రమ తల వంచుకుని శివరంజని వాయిస్తూంది. రమ దృష్టి రాగం మీద లేదు.

తను కొత్త ఊరు వెడితే ఇంత చక్కని రాగాలెవరు చెబుతారు తనకు? ఎవరు చెప్పగలరు?

ఇక తన సంగీతానికి ఫుల్‌స్టాపే.

ఇంతవరూ వచ్చిన విద్యకిక భవిష్యత్తే లేదా?

మనస్సు ఆలోచనామగ్నమైనా రాగం మాత్రం స్వరస్థానాలు తప్పడంలేదు. ఎంతో హృదయంగమంగా ఉంది వాయింపు.

ఆలాపన ముగియగానే మేష్టారు చిన్నగా దగ్గారు. వెనక్కి తిరిగి చూసింది రమ.

మేష్టారు!

ఎంతసేపటినుండి వింటున్నారో?

కంగారుగా లేచి నిలబడింది.

"చాలా బాగా వాయించావమ్మా! రేడియోలో ఎవరో వాయిస్తున్నారనుకున్నాను. నువ్వనుకోనేలేదు సుమా! అమ్మ దొంగా! నా దగ్గర ఎప్పుడూ ఇలా వాయించలేదేం?" అన్నారు శంకరం మేష్టారు.

"మేష్టారూ! మీకు శివరంజని అంటే ఎంత ఇష్టమో నాకూ తెలుసు. ప్రతి ప్రోగ్రాంలో ఆ రాగం వాయించి మిమ్మల్ని స్మరించుకుంటాను. ఆ రాగం మీకు నా ఆహ్వానం!" అంది రమ కన్నీళ్లు తుడుచుకుంటూ.

"రేడియోలో వాయించితే ఇంట్లో కూర్చుని వింటాను. ఎక్కడైనా కచేరీ చేస్తే ఎగిరిరానూ నా చిట్టితల్లి కచేరీకి!" అన్నారు మేష్టారు.

ఆ రోజు కూడా పాఠం చెప్పారు. శాస్త్రానికి సంబంధించిన ముఖ్యవిషయాలెన్నో చెప్పారు.

000

మరి ఇప్పుడా మేష్టారెక్కడ?

ఎక్కడికి వెళ్లారో? ఎందుకు వెళ్లారో? ఫిడేలు తీసుకువెళ్లారట!

పాపం, ఇంటి దగ్గర భార్య, బిడ్డలు బెంగపెట్టుకుని ఉంటారు ఆయన కోసం.

శివరంజని వాయిస్తే వస్తానని మాట ఇచ్చారు.

ఇప్పుడు తను వాయించినా ఎలా వస్తారు? రారు.

"ఏ కొండల్లోకైనా వెళ్లి హాయిగా పాడుకుంటూ జీవితం గడపాలని ఉంది. నేను ఎక్కడికైనా వెళ్లిపోయానని వింటే నా శిష్యులను మోసం చేసి పోయా ననుకోకండేం!" అనేవారు అప్పుడప్పుడూ.

"అదేమిటండీ?" అంటే, "ఏమీ లేదు. ఊరికేనే అలా తోచింది!" అనేవారు మేష్టారు.

ఇందుకే అని ఉంటారు. ఆయన మనస్సులో ఏమి తుఫానులో!! రమ ఆలోచనలతో కరిగిపోయింది.

"ఏదీ, శివరంజని వాయించమ్మా!" అన్నారు కొత్త మేష్టారు.

రమ చిన్న మనస్సుకు శివరంజని కరుణామయమైపోయింది. తను శివరంజని పాడితే అది మేష్టారి కాహ్వానం.

వయొలిన్ మీద ఆలపించింది శివరంజని రాగం.

అన్ని అవధులూ దాటి, శిఖరాల నధిగమించి, శివరంజని రాగం ఆరోహణలో జాలిగా, బాధగా తన వాళ్లందరినీ వదిలిపెట్టి, అర్ధరాత్రి లేచి అంధకారంలోకి పయనిస్తున్న బుద్ధుడిలా ఫిడేలు చేత్తో పట్టుకుని హిమాలయాలవైపు తల వంచుకుని నడచిపోతున్న తన మేష్టారులాగ అనిపించి, వినిపించి రమ మనస్సు దడదడలాడిపోయింది.

"రండి, మేష్టారూ రండి. ఎన్నిసార్లు వాయించను ఈ శివరంజని? మీకు ఎప్పటికి వినబడేను? నాకు సంగీతంలో తల్లీ, తండ్రీ అయిన మీరు ఎక్కడో తిరుగాడుతూంటే నేనేమయిపోతాను? నా ఆహ్వానం వినిపించుకోండి. మేష్టారూ... తిరిగి రండి!" రమ మనస్సు పరిపరి విధాల బాధపడిందానాడు.

"ఎవరికో రైల్లో కనపడ్డారట!" అన్నారొకరు.

"తంజావూరు సంగీతపండితులకు ప్రసిద్ధి. ఇంకా ఏమైనా నేర్చుకుందామని ఉంది కాబోలు. అక్కడ ఒక మహాపండితుని ఆశ్రయించి శుశ్రూష చేస్తున్నారని విన్నాను. 'గురుశుశ్రూష యా విద్యా' అన్నారు కదండీ!" అన్నారు ఆ ఊళ్లోని పురాణం శాస్త్రులుగారు.

అక్కడ వారికి కనబడ్డారనీ, ఇక్కడ వీరికి కనపడ్డారనీ చెప్పడమే కానీ స్వయంగా ఆయన్ను చూసినవాళ్లు ఒక్కరూ లేరు.



ఆయన గురించి వాళ్లవాళ్లు పేపర్లలో వేయించారు. రేడియోలో ప్రకటన చేయించారు.

ఏమీ ప్రయోజనం కనిపించలేదు.

రమ శివరంజని వాయించడం పూర్తిగా మానేసింది. వాయించడం అనే ఆలోచన వచ్చేసరికే మేష్టారు చేసిన వాగ్దానం జ్ఞాపకం వచ్చి కన్నీళ్లు వచ్చేవి.

"ఎంతో బాగా చెప్పేవారు శంకరం మేష్టారు. చిన్నపిల్లకు అన్నం కలిపి తినిపించినట్లే కదా! ఎంతో బుజ్జగించి చెప్పేవారు!" అంటుంది రమ అమ్మగారు.

"మర్మం లేకుండా విద్య చెప్పారు. అమ్మాయి సంగీతాన్ని ఎవ్వరూ తప్పు పట్టలేరు!" అంటారు నాన్నగారు.

సంగీతం ప్రారంభించిన కొత్తలో వేళ్లు సరియైన స్థానంలో పడేవి కావు. అపస్వరం వచ్చేది. అప్పుడు వేలు పట్టుకుని వాయించేవారు మేష్టారు.

ఒకమారు త్రిస్థాయి సాధన చేస్తున్నారు.

పావుగంట అయ్యేసరికి రమకు చేతులు లాగాయి. కాళ్లు తిమ్మిరెక్కాయి.

"ఇక వాయించలేను!" అంది రమ.

"ఎందుకు వాయించలేవు? ఒక గంటవరకు కమాను ఆపినా, కాలు కదిపినా జాగ్రత్త!" అన్నారు మేష్టారు.

అంతే! గంటా వాయించేసింది.

అలాగ నయానా, భయానా చెప్పేవారు.

ఆ విషయాలు చెబుతూంటుంది రమ.

ఈ విధంగా తరచూ మేష్టార్ని గురించి వాళ్ల ఇంట్లో చెప్పుకోవడం పరిపాటైపోయింది.

000

రమ సంగీతనైపుణ్యాన్ని చూస్తున్న కొత్త మేష్టారు సాటిపాటకులతో చెప్పారు.

ఆ ఊళ్లో అప్పుడప్పుడూ జరిగే కచేరీలకు రమ వెడుతూండేది.

ఆమెను కూడా ఒక ప్రోగ్రాం ఇమ్మని కోరారు పాటకులంతా. రమ నాన్నగారు అంగీకరించారు. ప్రోగ్రాం పేపరు అచ్చు వేయించి పంచిపెట్టారు. రమకు సాయంగా తల్లీ, తండ్రీ వచ్చారు.

**( ఎగతా 47వ పేజీలో)**

## పిప్పిపళ్లు ఎలా వస్తాయి?

శరీరంలోని అన్ని అవయవాలకంటే దంతాలు చాలా గట్టివి. అయినప్పటికీ ఇతర అవయవాలకంటే ఎక్కువగా సమస్యలు తెచ్చిపెట్టేవి ఇవే. కారణం వీటిపట్ల మనం చూపిస్తున్న నిర్లక్ష్యం. మనం ఆహారం తీసుకున్న తర్వాత నోటిని శుభ్రం చేసుకోకపోతే (ముఖ్యంగా పడుకునే ముందు) నోటిలో బాక్టీరియా ఉత్పత్తి అవుతుంది. వాటినుంచి వచ్చే ఒక విధమైన ఆమ్లం వల్ల దంతాలలో చిన్నచిన్న రంధ్రాలు ఏర్పడతాయి. ఈ సూక్ష్మరంధ్రాలు క్రమేణా పెద్దవై దంతాలను పిప్పిపళ్లుగా మార్చేస్తాయి. ఈ రంధ్రాలవలన దంతాల గట్టితనం పోతుంది. నోటి దుర్వాసన ఎక్కువవుతుంది. తర్వాత పంటినొప్పి వచ్చి వాటిని శాశ్వతంగా తీసేయ్యాల్సిన పరిస్థితి వస్తుంది. కాబట్టి చికిత్సకంటే నివారణ ముఖ్యమనే సిద్ధాంతం ప్రకారం ప్రతిరోజూ ఆహారం తీసుకున్న వెంటనే నోటిని శుభ్రం చేసుకోవడం మంచిది.

సి.

(41వ పేజీ తరువాయి)

వేదిక మీద అడుగుపెట్టేటప్పుడు తన పూర్వపు గురువుగారిని తలుచుకుని నమస్కారం చేసింది మనస్సులో.

చిన్నప్పటినుండి నలుగురిలోనూ పాడడం అలవాటు చేశారు శంకరం మేష్టారు. అందుచేత ఆ అమ్మాయికి సభాకంపం అంటే ఏమిటో తెలియదు.

హంసధ్వనితో "వాతాపి గణపతి" ప్రార్థనతో కచేరీ ప్రారంభించింది. క్రమ ప్రకారం వాయించింది.

రాగం, తానం, పల్లవి అయింది.

కచేరీ పూర్తి కావచ్చింది.

ఇక తిల్లానా వాయించాలి. అదే ఆఖరి పాట. ప్రోగ్రాంలో అచ్చువేశా రావిధంగా.

అయితే ఆమె వాయిస్తున్నది తిల్లానా కాదు!

శివరంజని!!!

ఎందుకు వాయిస్తూందో ఆమెకే తెలియదు. ఆ రాగం మానేసి చాలా రోజులైంది.

"... ఇదేమిటి? ఇది ప్రారంభించింది? అంతా బాగానే ఉందనుకుంటూంటే చివరికి పాడుచెయ్యదు కదా!" అనుకుంటూ కంగారు పడుతున్నారు తల్లీదండ్రీ.

ఆమెకిదేమీ తెలియదు. ఆవేశంగా వాయించేస్తూంది. బాగా సాధనలో ఉన్నట్టే ఉంది వాయింపు. సభ్యులంతా తలలూపుతున్నారు. అందరి కళ్లూ చెమ్మగిల్లుతున్నాయి.

శివరంజని జాలి రాగం అంటారు. ఆ రాగం వింటూంటే హృదయం ద్రవించిపోతున్నట్లనుభూతి కలుగుతుంది.

ఆ రోజల్లా మబ్బుగా ఉంది.

రమ శివరంజని వాయిస్తూంది.

వానజల్లు ప్రారంభమైంది.

బయట లౌడ్ స్పీకరు దగ్గర వింటున్న జనం లోపలకి సర్దుకుంటున్నారు. వారిలో తల మీదుగా కండువా కప్పుకుని ఒకాయన అందరినీ తప్పించుకుంటూ వచ్చి సభావేదిక ముందు వరసలో కూర్చున్నాడు. గడ్డం మాసి ఉంది. బట్టలు ధూళిగా ఉండి చాలా దూరప్రయాణాలు చేసిన లక్షణాలు కానవస్తున్నాయి. ముగ్ధుడై వింటున్న ఆయన్ను కుతూహలంగా చూసి "ఏ ఊరు తమది?" అన్నారు పక్కనున్న ఒకరు.

"ఈ ప్రాంతమే. యాత్రలు చేసుకుని వస్తున్నాను. ఇందాకనే ఈ ఊరు వచ్చాను. ప్రోగ్రాం కాగితం చూశాను. నాకు సంగీతం అంటే సరదా! శివరంజని రాగం అంటే అన్ని రాగాలకంటే చాలా ఇష్టం!" అన్నాడా వ్యక్తి.

రమ కళ్లు మూసుకుని వాయిస్తూంది.

చెంపల మీదుగా కన్నీళ్లు ప్రవహిస్తున్నాయి. నాగస్వరం వింటున్న నాగుపాముల్లా తలలూపుతున్నారు సభ్యులు. ఇవేమీ రమకు తెలియవు. కొంతసేపటికి రాగం ఆగింది.

ఫిడేలు కిందపెట్టి కళ్లు తెరిచింది.

కళ్లు తెరిచింది రమ!

తనకు... ఎదుట... మేష్టారు!!

తేరిపారచూసింది రమ. తలమీదుగా అదే రుద్రాక్షంచు కండువా కప్పుకుని మొదటి వరసలో కూర్చున్నారు. "నీ శివరంజని విని వచ్చానమ్మా!" అన్నారు నవ్వుతూ శంకరం మేష్టారు. రమ చేతిలోని కమాను తెలియకుండా క్రిందపడిపోయింది.

■

# వివాహచిహ్నాలు అనాగరకతను తెలుపుతాయా?



వివాహమైనట్లు తెలిసేందుకు స్త్రీలు కాళ్లకు మట్టెలు పెట్టుకోవటం చాలా ముఖ్యం. అది సౌభాగ్యచిహ్నాల్లో ఒకటి. ఇప్పుడు అంతా ఫ్యాషన్ మాయలో పడిపోయి దేన్నయినా తీసేయటానికి వెనుకాడటం లేదు. అంతా అత్యాధునికత మరి! అసలీ మట్టెలు పెట్టుకోవటం అనేది ఎందుకన్నది కొందరి ప్రశ్న. చాలాసార్లు పిల్లల విషయంలో అండాలు కిందికి దిగిన సందర్భాల్లో కాలి బొటనవేళ్లకు రాగి కడియాలు చుట్టటం వల్ల అవి సర్దుకుపోవటం మనవాళ్లు అంగీకరిస్తారు. అదీ కాక కామసంబంధ నాడులకూ, కాలి మొదటి రెండు వేళ్లకూ ఏదో అవినాభావసంబంధం వుందటవైద్యశాస్త్రపరంగా. తమలోని అధికకామాన్ని అదుపులో పెట్టటానికే సన్యాసులూ, బాబాలూ, స్వామీజీలూ పావుకోళ్లు ధరిస్తారు. అయితే నేడు సర్వేసర్వత్రా వెలిగిపోతున్న దొంగసన్యాసులకు ఈ విషయం తెలుసో లేదో!

కాంతామణులు కూడా పావుకోళ్లు వేసుకుంటే వారిలోని కామవాంఛలు పూర్తిగా తగ్గిపోయే ప్రమాదం వుంది కనుక, వారి కాళ్ల రెండవ వేలికి మట్టెలు వేసే ఆచారాన్ని ప్రవేశపెట్టివుంటారు. ఈ మట్టెల వల్ల కాలి మొదటి, రెండవ వేళ్ల మీద పడే ఒత్తిడి వల్ల మహిళల్లో కామం అదుపులో వుంటుందట. పైగా ఇంకో లాభం కూడా వుంది. అదేమిటంటే కొందరు గర్భిణుల్లో గర్భసంచి కిందికి జారుతుంటుంది. మట్టెలు ధరించటం వల్ల అది జరగకుండా వుంటుందట. ఇది వైద్యులు పరిశోధించి చెప్పిన విషయం.

కాని ఈ సంగతిని కూడా "ఆ! చాదస్తం!" అని కొట్టిపారేసేవారూ వున్నారు. కాని ఓసారి ఆలోచిస్తే ఇది నిజమనిపించక మానదు. మొదట్లో వివాహితలు సంప్రదాయసిద్ధంగా చేతులకు గాజులూ, కాళ్లకు మట్టెలూ వేసుకునేవారు. వారి ప్రవర్తనతో నేటి ఆధునికయువతుల ప్రవర్తనను పోల్చిచూస్తే... మట్టెలు పెట్టుకోవటం చాలా మోటుగా, అనాగరకంగా వుందని తీసిపారేసేవారు, బోయ్‌ఫ్రెండ్స్ కావాలని కోరుకుంటూ, విచ్చలవిడిగా ప్రవర్తిస్తుంటారు. ఆ నాటి సుమంగళులు మాత్రం నెమ్మదిగావుంటూ, అందరితోనూ మాట్లాడే పద్ధతి దగ్గరినుంచి అన్నిటా వారి ప్రత్యేకతనూ, మంచితనాన్నీ నిలుపుకుంటుండేవారు. నేడు టీవీల ప్రపంచంలో పడినా పల్లెటూళ్లలో పడతుల తీరు అలాగే, మునుపటిలాగే వుంది. మరి ఈ తేడా ఇంత స్పష్టంగా కనబడుతుంటే మట్టెలు పెట్టుకోవటం అనాగరకమని అనటం తగునా? ఎంత మాత్రం తగదు. మన పెద్దలు ఏది చెప్పినా మన మంచికే చెబుతారు అనేది గుర్తుంటే చాలు. 'పెద్దల మాట చద్దిమూట' అనే సామెత ఊరికే పుట్టలేదు కదా!

ఎస్.